తలుపు తట్టి.. నాడి పట్టి

- గ్రామీణులకు వరంలా మారిన 'ఫ్యామిలీ ఫిజీషియన్'
- ఇంటింటికీ వెళ్లి వైద్యుల సేవలు
- ఉచితంగానే మందులతో పాటు పరీక్షలు
- ఖర్చులు, ఇబ్బందులు తప్పాయని ప్రజల హర్షం

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు గ్రామీణులకు వరంలా మారాయి. నేరుగా వైద్యులే ఇంటి తలుపు తట్టి అనారోగ్య సమస్యలపై ఆరా తీస్తున్నారు. ఫ్యామిలి ఫిజీషియన్ ద్వారా 66 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు, 12 రకాల వ్యాధులకు వైద్య సేవలను వాళ్ల ఇంటి వద్దనే అందిస్తున్నారు. వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లే కష్టాలు తప్పడంతో పాటు వైద్యులే ఇంటి వద్దకు వచ్చి సేవలు అందిస్తుండటంపై అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రొద్దం: నడవలేని స్థితిలో ఉన్న మహిళ పేరు జయలక్ష్మమ్మ. వీరిది రొద్దం మండలం చిన్నమంతూరు. 38 ఏళ్లకే ఈమె నరాల బలహీనతతో మంచానికే పరిమితమైంది. గతంలో కుటుంబ సభ్యులు వైద్యం కోసం అనంతపురం, హిందూపురం తదితర ప్రాంతాలకు వెళ్లేవారు. దీంతో కుటుంబ సభ్యులు అనేక అవస్థలు పడేవారు. ఇప్పుడు డాక్టర్ ఇంటి వద్దకే వచ్చిన వైద్యం అందిస్తుండటంపై జయలక్ష్మమ్మ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతున్నారు.



చిలమత్తూరు: ఈ చిత్రంలో వైద్య సిబ్బంది చేత సేవలు పొందుతున్న వృద్ధురాలి పేరు నరసమ్మ. వీరిది కొడికొండ. కాలు దెబ్బతినడంతో నడవలేని పరిస్థితి. చికిత్స కోసం వైద్యుడు దగ్గరికి వెళ్లాలన్నా ఖర్చుతో కూడుకున్న పనే. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా నేరుగా ఆమె ఇంటికే వెళ్లి వైద్యురాలు తేజస్విని చికిత్స నిర్వహిస్తున్నారు. ఆమెకు అవసరమైన సూచనలు, మందులు అందిస్తున్నారు. ఏఎన్‌ఎంతో పాటు ఆశా కార్యకర్త నిత్యం పర్యవేక్షించేలా చర్యలు చేపట్టారు. 'మునుపెన్నడూ డాక్టర్లు వచ్చింది లేదు సామి... ఇప్పుడు నెలలో రెండు సార్లు మేడం వచ్చి చూసి వెళ్తున్నారు. నాకు చాలా సంతోషంగా ఉంది' అని నరసమ్మ చెబుతున్నారు.

హిందూపురం: హిందూపురం మండలం బేవనహళ్లి గ్రామానికి చెందిన ఆదినారాయణకు 75 ఏళ్లు. పిత్తాశయంలో ఇన్‌ఫెక్షన్ కారణంగా నొప్పితో బాధపడుతూ మంచం నుంచి కదలేకపోతున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ మంజునాథ్ వైద్య సేవలు అందించడంతో పాటు ఉచితంగానే మందులు అందిస్తున్నారు. ప్రభుత్వ వైద్యసేవలతో ప్రస్తుతం నడవగల్లుగుతున్నానంటూ ఆదినారాయణ హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నియోజకవర్గం	హిందూపురం
పీహెచ్‌సీల సంఖ్య	5
వైద్యుల సంఖ్య	10
నియోజకవర్గం	పెనుకొండ
పీహెచ్‌సీల సంఖ్య	5
వైద్యుల సంఖ్య	9
నియోజకవర్గం	మడకశిర
పీహెచ్‌సీల సంఖ్య	09
వైద్యుల సంఖ్య	18

నెలలో రెండుసార్లు సేవలు

గత ఏడాది అక్టోబర్ నుంచే 'ఫ్యామిలీ ఫిజీషియన్' కాన్సెప్ట్‌ను ట్రయల్ రన్‌లో భాగంగా నిర్వహిస్తున్నాం. వైద్యులు ఆయా గ్రామాల్లోని ఇళ్ల వద్దకే వెళ్లి సేవలు అందిస్తున్నారు. ఒక్కొక్క పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు ఉంటారు. నెలలో 26 రోజులు ఫ్యామిలీ ఫిజీషియన్ కొనసాగుతుంది. ఇద్దరిలో ఒకరు పీహెచ్‌సీలో మరొకరు ఫ్యామిలీ డాక్టర్ ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారు. నెలలో ఒక గ్రామాన్ని రెండు సార్లు సందర్శిస్తుంటారు. పక్కాగా 'ఫ్యామిలీ డాక్టర్' సేవలు అందిస్తున్నాం.



– మంజువాణి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, పెనుకొండ

మడకశిరరూరల్: ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధుడి పేరు లక్ష్మీనారాయణప్ప. వీరిది మడకశిర మండలం జీవీ పాళ్యం. పక్షవాతంతో చేయి, కాళ్లు పడిపోవడంతో మంచానికే పరిమతమయ్యారు. జిల్లా కేంద్రం, ఇతర ప్రాంతాల ఆస్పతులకు వెళ్లడానికి ఇబ్బందిగా మారిన సమయంలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు ఈయనకు వరంలా మారాయి. నీలకంఠాపురం పీహెచ్‌సీ వైద్యులు వారానికోసారి ఇంటి వద్దకే వచ్చి వైద్య చికిత్సలు నిర్వహించి మందులను అందిస్తున్నారు. పైసా ఖర్చు లేకుండా ఇంటి వద్దకే ఫ్యామిలి ఫిజీషియన్ సేవలు అందిస్తుండటంతో లక్ష్మీనారాయణప్ప జగనన్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



పరిగి: ఇక్కడున్న మహిళ పేరు అంజినమ్మ. ఈమె వయసు 71 ఏళ్లు. వీరిది పరిగి మండలం పైడేటి. బీపీ, షుగర్ వ్యాధులతో బాధపడుతున్న ఈమెకు ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా వైద్యులు ఇంటి దగ్గరకే వచ్చి సేవలు అందిస్తుండటంతో బీపీ, షుగర్ అదుపులోకి వచ్చాయని అంజినమ్మ హర్షం వ్యక్తం చేస్తున్నారు. తన ఆరోగ్య మెరుగుకు కారణమైన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నకు కృతజ్ఞతలు తెలిపారు.



అమరాపురం: ఈ చిత్రంలో వైద్యసిబ్బంది బీపీ చెక్ చేస్తున్న వ్యక్తి పేరు రామదాసప్ప. ఈయనది అమరాపురం మండలం తమ్మడేపల్లి. ఇతను మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ఇంటి వద్దకే వచ్చి వైద్యసిబ్బంది సేవలు అందిస్తుండటంపై రామదాసప్ప హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా రూ.800 విలువ చేసే మందులు ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. పేదల వైద్యానికి భరోసా ఇస్తున్న సీఎం జగనన్న మరోసారి సీఎం కావాలని కోరుకుంటున్నానన్నారు.



క్లుప్తంగా

ఘనంగా హజరత్ సయ్యద్ మస్తాన్‌షా ఉరుసు



అలంకరణలో హజరత్ సయ్యద్ మస్తాన్ షా సమాధి

గుడిబండ: మండలంలోని భూతప్ప కనుమలో ఆదివారం ముస్లింలు ఘనంగా హజరత్ సయ్యద్ మస్తాన్‌షా ఉరుసు ఉత్సవాన్ని జరుపుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది.

భగవద్గీతపై ప్రచారం

హిందూపురం టౌన్: స్థానిక ముద్దిరెడ్డిపల్లి త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. మండల పరిధిలోని గొల్లాపురం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలపై ప్రచారం చేపట్టి ఆధ్యాత్మిక గ్రంథాలను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఆదినారాయణ, సభ్యులు మునీంద్ర, శేఖర్, తిమ్మప్ప, సుభద్ర, కోణమ్మ, నాగమ్మ, కాలక్క, చౌడమ్మ, సుబ్బమ్మ, లీలక్క తదితరులు పాల్గొన్నారు.

రామ్మోహన్ సేవలు మరువలేనివి



రామ్మోహన్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న నాయకులు

హిందూపురం: ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కరంతో పాటు సంస్థ అభివృద్ధికి తనవంతు సేవలు అందించిన నేషనల్ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపకులు రామ్మోహన్‌రావు సేవలు మరువలేనివని ఎన్‌ఎమ్‌యూ జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి రాజారెడ్డి, రాజారెడ్డి అన్నారు. ఆదివారం హిందూపురం డిపోలో యూనియన్ నాయకులు, కార్మికులు రామ్మోహన్‌రావు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్‌రత్న అవార్డు గ్రహీత రామ్మోహన్‌రావు కార్మికులకు అనేక సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో రవికుమార్, మారుతి వెంకటేష్, భారతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

అమరాపురం: మండలంలోని హేమావతి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. మడకశిర నియోజకవర్గం నుంచే కాక సమీప కర్ణాటక ప్రాంతాలైన తుమకూరు, బెంగళూరు, హిరియూర్, మదుగిరి, శిర, చెలికెర, పావగడ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



సీఅండ్ఐసీ మిషన్ కాంపౌండ్ చర్చ్ నూతన కార్యవర్గ సభ్యులు

హిందూపురం టౌన్: స్థానిక సీఅండ్ఐసీ మిషన్ కాంపౌండ్ చర్చ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక చర్చిలో ఎన్నుకున్నారు. నూతన డీకెన్ బోర్డ్ సభ్యులలో సెక్రటరీగా నాగేంద్ర కుమార్, ట్రెజరర్‌గా ఆదర్శ్ కుమార్, జాయింట్ సెక్రటరీగా క్రిస్టఫర్, జాయింట్ ట్రెజరర్‌గా ఆనంద్ రాజ్, గాస్పల్ కోఆర్డినేటర్‌గా విక్టర్ జాషువా, సండే స్కూల్ కోఆర్డినేటర్‌గా జాన్సన్, డీకెన్ గౌరవ సభ్యులుగా జార్జ్ బాబులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం రెండేళ్ల పాటు కొనసాగుతుందని సంఘ పాస్టర్ స్టీఫెన్ రాజ్ తెలిపారు.

నృసింహుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం



నరసింహస్వామి మూలవిరాట్

పావగడ: పట్టణంలోని కణివె లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలోని లక్ష్మీ నరసింహస్వామి విగ్రహాన్ని ప్రత్యేక అలంకరించారు. నరసింహస్వామికి ఆలయ ప్రధాన అర్చకుడు నరసింహ గోపాల్ పూజా కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం స్వస్తి వాచన, పంచామృతాభిషేకం, మహా మంగళారతి తదితర పూజలు నిర్వహించారు. సోమవారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12.45 గంటలకు లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మ రథోత్సవం వైభవంగా జరగనుంది. రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ సమితి పదాధికారులు తెలిపారు.

అడుగు...గుడిగా మారింది

శ్రీమన్నారాయణుడు నరసింహావతారంలో ఉగ్ర రూపుడై హిరణ్యకశ్యపుడిని వధించి లక్ష్మీదేవి కోసం అన్వేషిస్తూ భూలోకంలో కొండలు, గుట్టల్లో అడుగు లేసుకుంటూ సంచరిస్తుండగా పావగడలోని కనుమల మధ్య గుట్టపై అడుగు వేశారట. ఆ అడుగుకు రాళ్లు ఉబ్బి నరసింహస్వామి అంశాన్ని పొందాయని, స్వామిని అనుసరిస్తూ వచ్చిన లక్ష్మీదేవి సైతం ఉబ్బిన శిలలో చేరుకోవడంతో అది కనుమ నరసింహస్వామి గుడిగా మారిందని చరిత్ర చెబుతోంది. అనంతరం 1937లో అప్పటి పావగడ తహసీల్దార్ ఆనందాళ్వార్ సూచనల మేరకు గ్రామ పెద్ద గౌడ సుబ్బణ్ణ సహకారంతో బి అచ్చమ్మనహళ్ళి వడ్డెర ఎర్రన్న దేవాలయాన్ని నిర్మించారు. 1939 సంవత్సరం ఫాల్గుణ శుద్ధ పున్నమి రోజున కనుమ లక్ష్మీ నరసింహస్వామి శిలను ఆలయంలో ప్రతిష్ఠించారు. ధర్మకర్త భంగి ఉగ్ర నరసింహప్ప తదితర భక్తుల సహకారంతో రథాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి కేఈబీ సంస్థ చైర్మన్ పి నరసింహమూర్తి ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఆలయం దేవదాయశాఖ ఆధీనంలో ఉండటంతో ఆలయ ట్రస్ట్ పదాధికారులు భక్తుల విరాళాలతో ఆలయాభివృద్ధికి కృషిచేస్తున్నారు.

ఘనంగా రేణుకాచార్య జయంతి

పావగడ: బేడ జంగమరల ఆర్యాధ్యదైవం జగద్గురు రేణుకాచార్యుల జయంతిని స్థానిక తాలూకా కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుకాచార్యుల చిత్ర పటం వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాజగోపాల్, జంగమర సంఘం నాయకులు రాజేంద్ర ప్రసాద్, పరమేశ్, రాజేశ్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ కవి చన్న బసణ్ణ మాట్లాడుతూ రేణుకాచార్యులు .. కేదారనాథ్, కాశీ విశ్వనాథ్, శ్రీశైల మల్లికార్జున, కొల్లిపాకి సోమనాథ్, బాళెహొన్నూరు వంటి 5 గురు పీఠాలు ఏర్పాటు చేశారన్నారు. ఆంధ్రలోని కొల్లి పాకి ప్రాంతంలో రేణుకాచార్యుల ఆలయం ఉందన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

సోమందేపల్లి: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పెనుకొండ మండలం సుద్దబట్లపల్లి గ్రామానికి చెందిన వెంకారెడ్డి అనే వ్యక్తి ఇటీవల కాలంలో పక్షవాతానికి గురయ్యాడు. తరుచూ అనారోగ్యం పాలవుతుండటంతో జీవితంపై విరక్తి చెందిన వెంకారెడ్డి ఆదివారం రంగేపల్లి రైల్వేస్టేషన్ వద్దకు చేరుకున్నాడు. బెంగళూరు వైపు వెళ్లే ఓ రైలు కింద పడటానికి ట్రాక్‌పైకు రాగా రైల్వే సిబ్బంది గమనించి అతన్ని పట్టుకున్నారు. అనంతరం భార్య పాపమ్మకు సమాచారం అందించారు. అతని కుమారులు రంగేపల్లి రైల్వేస్టేషన్ వద్దకు చేరుకొని తమ స్వగ్రామానికి తీసుకువెళ్లారు.

ఘనంగా కదిరి పున్నమి ఉత్సవాలు ప్రారంభం

పెనుకొండ రూరల్: మండలంలోని అమ్మవారిపల్లిలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో కదిరి పున్నమి ఉత్సవాలను ఆదివారం నుంచి ప్రారంభించారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజల అనంతరం మంగళవారం స్వామి వారికి అభిషేకం, మహా మంగళ హారతి, అన్నదానం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

మానవత్వం చాటుకున్న వలంటీర్లు



చిలమత్తూరు: తిరుపతి స్వీమ్స్ వద్ద పింఛన్ అందజేస్తున్న వలంటీర్

సాక్షిబృందం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు ఇంటి వద్దకే చేరుతున్నాయి. ఇందులో భాగంగానే సామాజిక పింఛన్లను పక్కాగా అందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని పలువురు వలంటీర్లు మానవత్వాన్ని చాటుకున్నారు. సుదూర ప్రాంతాల్లో ఉన్న పింఛన్‌దారులకు అక్కడికే వెళ్లి పింఛన్ అందిస్తూ అందరి మన్ననలనూ పొందుతున్నారు.



హిందూపురం: బెంగళూరులో ఉన్న షేక్ షాకినాభానుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



స్వామివారి ఉత్సవ విగ్రహాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న కమిటీ సభ్యులు



అలంకరణలో స్వామివార్ల విగ్రహాలు

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహాస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఘనంగా అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేకువజామున నుంచే సుప్రభాత సేవతో స్వామి వారి మూల విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీదేవి సమేతంగా నరసింహాస్వామి మూల విగ్రహాన్ని వెండి, బంగారు ఆభరణాలతో పాటు పూలతో విషేశంగా అలంకరణ చేసి మహా మంగళారతి ఇచ్చారు. ఉత్సవ విగ్రహాలతో ఆలయ ప్రాంగణం చుట్టూ ప్రదక్షిణ చేశారు. వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు తొలిరోజు ప్రారంభం కావడంతో పట్టణ వాసులు, చుట్టు పక్కల గ్రామాలతో పాటు కర్ణాటక ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదం అందజేశారు.

నేడు కల్యాణోత్సవం

రొళ్ల లక్ష్మీనరసింహాస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు కల్యాణోత్సవ వేడుకకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

భర్త సమాధి వద్ద ఎమ్మెల్సీ పూజలు



గంగాధర్ సమాధి వద్ద ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్సీ మంగమ్మ కుటుంబ సభ్యులు

పెనుకొండ: హిందూపురం మాజీ పార్లమెంట్ సభ్యులు, దివంగత సానిపల్లి గంగాధర్ సమాధి వద్ద ఆయన సతీమణి, ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుమారుడు సానిపల్లి మహీధర్ ఇతర కుటుంబ సభ్యులతో కలసి హరిపురం వద్ద 44వ జాతీయ రహదారి పక్కనే వారి తోటలో ఉన్న మాజీ ఎంపీ సమాధి వద్ద ఘనంగా నివాళులర్పించారు. మంగమ్మ మాట్లాడుతూ మూడు సార్లు హిందూపురం పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన తన భర్త గంగాధర్ ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. తనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి సీఎం జగనన్న తమకు రాజకీయంగా మళ్లీ గుర్తింపును తీసుకువచ్చారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు. ఎమ్మెల్సీ వెంట వైఎసార్‌సీపీ మాజీ కన్వీనర్ నీరగంటి వెంకటరాముడు, పాదయాత్ర నటేష్ తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యం

- ఎమ్మెల్యే తిప్పేస్వామి



మడకశిరలో ఎమ్మెల్సీ అభ్యర్థుల తరుపున ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిర: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి ఓటర్లను కోరారు. ఆదివారం మడకశిరలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఎమ్మెల్సీ అభ్యర్థుల తరుపున ప్రచారాన్ని నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఓటర్లను కలిసి తమ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పట్టభద్రులకు అన్ని విధాలుగా చేయూతనందిస్తున్నారని తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ విజయవంతం కావడంతో రాష్ట్రంలోని దాదాపు 6 లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్ కోసం పట్టభద్రులు వైఎస్సార్‌సీపీకే ఓటు వేయాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, బోయ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ ఈశ్వర్, పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్ఎన్ క్రిష్ణమూర్తి, అంజన్‌కుమార్‌యాదవ్, దాసన్న, తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ తరుపున బరిలో ఉన్న ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి మెజర్టీతో గెలిపించాలని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆమిదాలగొంది, వైబీహళ్లి, కల్లుమర్రి, సీ కొడిగేపల్లి, మణూరు, గోవిందాపురం, జీవీపాళ్యం, గుండుమల, మెళవాయి పంచాయితీలోని గ్రామాల్లో జోరుగా ప్రచారం చేశారు. ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, వైస్ ఎంపీపీ మూర్తి, మండల జగనన్న సచివాలయం కన్వీనర్ నాగేంద్ర యాదవ్, మంజునాథ్, జమ్మానిపల్లి మూర్తి, రంగనాథ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలంటూ ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు చెరుకూరు, పెద్దమంతూరు, కలిపి, సానిపల్లి తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతిప్రసాద్‌రెడ్డి, సచివాలయాల సమన్వయకర్త ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి, కలిపి శ్రీనివాసులు, కమలాకర్‌రెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరుపున బరిలో నిలిచిన పశ్చిమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిలను గెలిపించాలంటూ జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు లోకేష్ ఓటర్లను అభ్యర్థించారు. పట్టణంలోని ముదిరెడ్డిపల్లి, లక్ష్మినగర్, దండురోడ్డు తదితర ప్రాంతాల్లోని టీచర్స్ ఓటర్లు, పట్టభద్రుల ఓటర్ల ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మీడియా కోఆర్డినేటర్ ప్రణయ్‌రెడ్డి, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు. మరో వైపు హిందూపురం మండలంలోని సంతేబిదనూర్, దేవరపల్లి, తుంగేపల్లి తదితర గ్రామాల్లో సర్పంచ్ లలితా రాము, వైఎస్సార్‌సీపీ నాయకులు కలసి ప్రచారం చేశారు.